క్లుప్తంగా

గాయత్రీ మాతకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఆస్పరి: మండల కేంద్రం సమీపంలోని రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు రూపా మోహన్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళ హారతులు తదితర కార్యక్రమాలు జరిపించారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

సుంకులమ్మకు కవచం విరాళం


కవచాన్ని తీసుకొస్తున్న దాతలు

మద్దికెర : స్థానిక సుంకులమ్మ దేవాలయంలో సుంకులమ్మ అమ్మవారికి స్థానికులు అల్లం నారాయణస్వామి, సుశీలమ్మ కుమారులు నాగరాజు, లక్ష్మి, నరసన్న, హేమలత కుటుంబీకులు 3 కిలోలతో తయారు చేయించిన కవచాన్ని శుక్రవారం విరాళంగా నిర్వాహకులకు అందజేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు దాతలకు ప్రసాదం పంపిణీ చేశారు.

ఘనంగా కుంభోత్సవం


హొళగుందలో కుంభాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

హొళగుంద: మండల కేంద్రంలో వెలసిన ఉలిగమ్మవ్వకు శ్రావణమాసం సందర్భంగా రజక కులస్తుల ఆధ్వర్యంలో కుంభోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. గ్రామంలోని పెద్దబావి వద్ద గంగపూజతో పాటు ప్రత్యేక పూజలనంతరం భక్తులు కుంభాన్ని ఆలయానికి గ్రామ వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆలయంలో దేవికి ఆకుపూజా, మహా మంగళారతి, నైవేద్య సంతర్పణ తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఆలయంలో భక్తులకు, స్థానికులకు అన్నదానం చేశారు.

నాటుసారా స్థావరాలపై దాడులు


బెల్లం ద్రావణాన్ని పారబోస్తున్న దృశ్యం

పత్తికొండ (ఆళ్లగడ్డ): స్థానిక సెబ్ స్టేషన్ పరిధిలోని జెఎం తండా పరిసర ప్రాంతాల్లో దాడులు చేసి 20 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకోవడంతో పాటు తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ సువర్ణ తెలిపారు. జెఎం తండా పరిసర ప్రాంతాల్లో నాటుసారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేయగా బట్టీ దగ్గర ఉన్న వ్యక్తులు పారిపోయారన్నారు. దీంతో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, బిందెల్లో ఉంచిన సుమారు 800 లీటర్ల బెల్లపు ఊటను పారబోశామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు చెప్పారు.

హంద్రీనీవా కాలువ కట్టకు మరమ్మతులు


కృష్ణగిరి వద్ద మరమ్మతులు చేయిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: మండల కేంద్రం సమీపంలోనున్న హంద్రీనీవా ప్రధాన కాలువ కట్ట వారం రోజుల క్రితం వర్షపు నీటి ధాటికి దెబ్బతింది. దీంతో కట్టకు శుక్రవారం హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు మరమ్మతులు చేపట్టారు. డీఈ చెన్నయ్య ఆధ్వర్యంలో జేసీబీతో దెబ్బతిన్న కట్టకు పైపులు వేసి గండిని పూడ్చారు. మరోమారు భారీ వర్షం వచ్చి గ్రామంలోని నీరు వచ్చే అవకాశం ఉండటంతో కట్ట దెబ్బతినకుండా పైపులు వేసి శాశ్వతంగా సమస్యను పరిష్కరించినట్లు డీఈ తెలిపారు.

హక్కుల సాధనకు పోరాటం తప్పదు

ఆలూరు: హక్కుల సాధనకు మాల కులస్తులు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహానంది పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ కార్యాలయంలో వీరేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ వల్ల మాలలు నష్టపోయేప్రమాదం ఉందన్నారు. వెంకటరాముడు,భరత్, మల్లికార్జున, లక్ష్మన్న,ఈరన్న పాల్గొన్నారు.

మళ్లీ తమ్ముళ్లకేనా?

తన పార్టీ కార్యకర్తల కోసం చంద్రబాబు ఏమైనా చేస్తారనేది జగమెరిగిన సత్యం. అందుకు ఉదాహరణగా.. ఆయన అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమ పథకాలన్నీ తెలుగు తమ్ముళ్లకే వర్తింపజేసి వారు వృద్ధి చెందేలా చేసి పేదల నోట్లో మట్టికొట్టారు. ఇందులో భాగంగా 2018లో గోకులాల పేరుతో పార్టీ కార్యకర్తలకు షెడ్లు మంజూరు చేశారు. తాజాగా మళ్లీ ఆ పథకం జీవం పోసుకుంది. ఉపాధి హామీ పథకం కింద 90 శాతం సబ్సిడీపై పశువులు, జీవాల కోసం షెడ్లు నిర్మించుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. ఇప్పుడు కూడా షెడ్ల కేటాయింపు స్థానిక టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే జరుగుతుందని ఆ పార్టీ కేడర్‌లో చర్చ నడుస్తోంది. అయితే ఈ సారైనా అర్హులకు కేటాయిస్తారో లేదో చూడాలి.

- కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ జీవం పోసుకున్న గోకులం షెడ్లు
- ఉపాధి నిధులతో ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాలకు 350, 230 చొప్పున షెడ్లు మంజూరు
- 2018లో మినీ గోకులం పేరుతో నిర్మాణాలు
- నాడు టీడీపీ కార్యకర్తలకే కేటాయింపు
- ఈసారైనా అర్హులకు ఇస్తారా?
- రెండు నియోజకవర్గాల నుంచి 870, 643కు పైగా దరఖాస్తులు


2018లో ఉపాధి నిధులతో హొలహర్వి మండలం బాపురంలో నిర్మించిన గోకులం షెడ్డు

మినీ గోకుల షెడ్లు, యూనిట్ విలువ, ఉపాధి నిధులు, రైతు వాటా వివరాలు..

షెడ్డు	ధర	రాయితీ	రైతు వాటా
2 పశువులు	రూ.1,15,000	రూ.1,03,500	రూ.11,500
4 పశువులు	రూ.1,85,000	రూ.1,66,500	రూ.18,500
6 పశువులు	రూ.2,30,000	రూ.2,07,000	రూ.23,000
20 గొర్రెలు,మేకలు	రూ.1,30,000	రూ.1,61,000	రూ. 39,000
50 గొర్రెలు	రూ. 2,30,000	రూ.1,61,000	రూ. 69,000
100 కోళ్లు	రూ.1,32,000	రూ. 92,400	రూ.39,600

ఆలూరు నియోజకవర్గంలో మండలాల వారీగా దరఖాస్తులు ఇలా..

మండలం	షెడ్లు మంజూరు	దరఖాస్తులు
ఆలూరు	50	75
ఆస్పరి	55	180
చిప్పగిరి	50	70
హొలహర్వి	50	215
హొళగుంద	55	150
దేవనకొండ	60	180

పత్తికొండ నియోజకవర్గంలో మండలాల వారీగా దరఖాస్తులు..

మండలం	షెడ్ల మంజూరు	దరఖాస్తులు
పత్తికొండ	50	77
తుగ్గలి	50	250
వెల్దుర్తి	50	101
కృష్ణగిరి	50	65
మద్దికెర	30	150


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మొలగవల్లిలో నిర్మించిన ఆర్బీకే

ఆలూరు రూరల్/తుగ్గలి : ఉపాధి హామీ పథకం నిధుల కింద 90 శాతం సబ్సిడీపై గోకులం షెడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం 'పచ్చ జెండా' ఊపింది. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ/వార్డు సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ క్లీనిక్, డిజిటల్ లైబ్రరీ,బల్క్ మిల్క్ కేంద్రాలు వంటి శాశ్వత నిర్మాణాలు, ప్రజోపయోగమైన వాటిని గ్రామాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్మించింది. అలాగే కాకుండా కేవలం టీడీపీ కార్యకర్తలకు దోచిపెట్టేందుకే మళ్లీ ఈ పథకాన్ని తీసుకొచ్చారనే విమర్శలు పల్లెల్లో వ్యక్తమవుతున్నాయి. 2014-2019 మధ్య కూడా ఉపాధి హామీ పథకం నిధులను తమ పార్టీ వారికి అనుకూలంగా ఖర్చు చేశారు. 2018లో నిబంధనలతో ఏ మాత్రం సంబంధం లేకుండా నియోజకవర్గంలో 228 షెడ్లను మంజూరు చేసి ఇందులో 90 శాతం తెలుగు తమ్ముళ్లకు ఇచ్చారు. తాజాగా పశువులు, గొర్రెలు,కోళ్లకు షెడ్లు నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించారు. ఈ సారి కూడా తమ కార్యకర్తలకే కట్టబెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

యూనిట్లు మంజూరు..

ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు 325, పత్తికొండ నియోజకవర్గంలోని ఐదు మండలాలకు 230 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. ఒక్కో మండలానికి 50 షెడ్లు చొప్పున కేటాయించారు. గ్రామ పంచాయతీల జనాభాను బట్టి 2 నుంచి 5 షెడ్లు దాకా మంజూరు చేయనున్నారు. వీటి నిర్మాణానికి ప్రభుత్వం 90 శాతం రాయితీ ఇస్తుంది. లబ్ధిదారుడు కేవలం 10 శాతం మాత్రమే చెల్లించాలనే నిబంధన పెట్టింది. టీడీపీ కార్యకర్తలు వాటి కోసం పోటీ పడుతున్నారు. తమకే కేటాయించాలని పెద్ద నాయకుల నుంచి సిఫారసు చేయించుకుంటున్నారు. అసలైన లబ్ధిదారులకు మంజూరయ్యే అవకాశం కనిపించట్లేదని పలువురు వాపోతున్నారు.

అడ్డగోలుగా దరఖాస్తుల స్వీకరణ

దరఖాస్తుల స్వీకరణలో నిబంధనలు పాటించడం లేదు. వాస్తవానికి జాతీయ ఉపాధి హామీ పథకం క్షేత్ర స్థాయి సిబ్బంది గ్రామ సభలు నిర్వహించి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు తీసుకోవాలి. కానీ ఎక్కడా అలా జరగడం లేదు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు ఉండేవారి నుంచి గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా దరఖాస్తులు స్వీకరించి పశుసంవర్ధక శాఖ అధికారులకు అందజేస్తున్నారు. పశుసంవర్ధ శాఖ అధికారులు సంబంధిత అప్లికేషన్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఆమోదం కోసం ఉపాధి హామీ పథకం సిబ్బందికి అందజేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు దరఖాస్తులను తీసుకుని దరఖాస్తుదారుడికి పశువులు,గొర్రెలు,కోళ్లు ఎన్ని ఉన్నాయని నిర్ధారించి సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంది. గతంలో షెడ్లు మంజూరు చేసిన మాదిరిగా ఈ సారి కూడా టీడీపీ కార్యకర్తలకే షెడ్లు మంజూరు చేసేందుకు టీడీపీ పెద్దలు అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. తమ కార్యకర్తల దరఖాస్తులనే తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. అలాగే పంచాయతీల ఆమోదం తప్పని సరిగా తీసుకోవాలి. కానీ అలా జరగడం లేదు. దరఖాస్తు స్వీకరణ గడువు నిర్ణయించలేదు. ఇప్పటి వరకు ఆలూరు నియోజకవర్గం నుంచి 870, పత్తికొండ నియోజకవర్గ నుంచి 643కు పైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ఆదర్శం.. జగనన్న పాలన..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలు, రైతుల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించారు. స్థానికంగానే సమస్యల పరిష్కరించాలని ఉపాధి నిధులతో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటుకు ప్రాధాన్యం ఇచ్చారు. పారదర్శకంగా శాశ్వత, ప్రజోపయోగమైన భవనాల నిర్మాణం చేపట్టారు. కానీ కూటమి ప్రభుత్వంలో ఇలాంటి వాటిని పట్టించుకోకుండా కేవలం తమ కార్యకర్తల సంక్షేమ కోసమే పథకాలు తీసుకొచ్చి వర్తింపుజేస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అర్హులు వీరే..

గోకుల షెడ్ల నిర్మాణాలకు ఎస్సీ, ఎస్టీ, దారిద్య్ర రేఖ దిగువనున్న వారు, మహిళా యజమాని, అంగవైకల్య యజమాని కుటుంబాలు, చిన్న, సన్నకారు రైతులు అర్హులు.

పంచాయతీ తీర్మానం తప్పనిసరి

సబ్సిడీ మినీ గోకుల షెడ్ల నిర్మాణాలకు దరఖాస్తు దారులు తప్పనిసరిగా గ్రామ పంచాయతీ తీర్మానం ఇవ్వాలి. ఆ తర్వాత మండల తీర్మానం చేసి తమ కార్యాలయానికి పంపుతారు. అర్హులకు షెడ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటాం.
– పక్కీరప్ప, డ్వామా క్లస్టర్ ఏపీడీ, పత్తికొండ

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం

షెడ్ల నిర్మాణానికి సంబంధించి ప్రస్తుతం దరఖాస్తులు తీసుకుంటున్నాం. తుది గడువు ఇంకా ప్రకటించలేదు. మండలానికి 50 యూనిట్లు చొప్పున మంజూరు చేశారు. లబ్ధిదారుల ఎంపిక ఎన్ఆర్ఈజీఎస్ వారు చేస్తారు. మేం కేవలం అర్హత మాత్రమే ధ్రువీకరిస్తాం.
– విక్టర్,పశుసంవర్థక శాఖ ఏడీ,ఆలూరు

నేడు పింఛన్ల పంపిణీ

తుగ్గలి : సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సెప్టెంబర్ 1వతేదీ ఆదివారం సెలవు రోజు కావడంతో 31వ తేదీనే పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కృష్ణగిరి మండలంలో 4,658, మద్దికెరలో 4,538, పత్తికొండలో 8,594, తుగ్గలిలో 7,668, వెల్దుర్తిలో 7,937 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. పింఛన్ల పంపిణీకి సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

మద్దికెర : సెప్టెంబర్ 1 ఆదివారం కావడంతో నేడే అనగా శనివారం ఉదయం పింఛన్లు ఉదయం 6 గంటల నుంచి పంపిణీ చేస్తామని ఎంపీడీఓ నరసింహమూర్తి శుక్రవారం తెలిపారు. 31వ తేదీ తీసుకోని వారికి సెప్టెంబర్ 2వ తేదీ అందజేస్తామని పేర్కొన్నారు. కావున వృద్ధులు, వికలాంగులు, వితంతువులు అందుబాటులో ఉండి పింఛన్ అందుకోవాలని సూచించారు.

కప్పట్రాళ్లలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న గ్రామస్తులు

దేవనకొండ: ఐపీఎస్ అధికారి, ఏపీ యాంటీ నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్ ఐజీ ఆకె రవికృష్ణ జన్మదిన వేడుకలను శుక్రవారం ఆయన దత్తత గ్రామమైన కప్పట్రాళ్ల గ్రామంలో గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. కర్నూలు బ్లడ్ బ్యాంక్ వారికి తలసేమియా రోగుల నిమిత్తం గ్రామ ప్రజలు, యువత అధిక సంఖ్యలో రక్తదానం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సే ట్రీస్ ప్రోగ్రాం మేనేజర్ బండమీది నారాయణ మాట్లాడుతూ ఆకె రవికృష్ణ గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ప్రస్తుతం గ్రామం సస్యశ్యామలంగా ఉందన్నారు. అనంతరం తానా స్త్రీ శక్తి భవనం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సే ట్రీస్ ప్రోగ్రామ్ మేనేజర్ బి.నారాయణ, కప్పట్రాళ్ల మల్లికార్జున, సర్పంచ్ చెన్నంనాయుడు, పోలీసు అధికారి భాస్కర్ పాల్గొన్నారు.

నివాళి

చిప్పగిరి: మండలంలోని నంచర్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు హనుమన్న తల్లి జయమ్మ అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి శుక్రవారం గ్రామానికి చేరుకొని మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. వైస్ సర్పంచ్ మీసాల హనుమంతు, దర్మేంద్ర,ఎల్లప్ప పాల్గొన్నారు.

కృష్ణగిరి: మండల కేంద్రానికి చెందిన మండల కో–ఆప్షన్ మెంబర్ షేక్ షాలుమియ్యా భార్య షేక్ ఫాతిమాబీ (56) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి గ్రామానికి చెరుకుని మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దేవనకొండలో స్పెషల్ ఫీవర్ సర్వే


రక్త నమూనాలను సేకరిస్తున్న మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సాయిబాబా

దేవనకొండ: స్థానిక సచివాలయం-2లో శుక్రవారం స్పెషల్ ఫీవర్ సర్వే, ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సాయిబాబా, వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రజల నుంచి రక్త నమూనాలను సేకరించారు. లార్వా ఉన్న డ్రమ్ములు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో లార్వాను గుర్తించి వాటిని అబేట్ ద్వారా నిర్మూలించేలా చర్యలు తీసుకున్నారు. అలాగే గ్రామస్తులకు సీజనల్ వ్యాధుల గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హెల్త్ సూపర్‌వైజర్‌లు రంగస్వామి, జయలక్ష్మి, శ్రీధర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైభవంగా అశ్వర్థ నారాయణ కల్యాణం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

మద్దికెర : స్థానిక కురువ వీధిలోనున్న అశ్వర్థనారాయణ కట్ట వద్ద శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం రావిచెట్టు, వేపచెట్టుకు పురోహితులు వేణుగోపాల్‌స్వామి ఆధ్వర్యంలో మంత్రోచ్చారణల మధ్య కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రావి, వేప చెట్లు వున్న కట్టకు పందిరి వేసి పూలతో అలంకరించారు. అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అశ్వర్థ నారాయణ స్వామి వారికి సంబంధించి కథను భక్తులకు చదివి వినిపించారు. ఇలాంటి పుణ్యకార్యాలను నిర్వహించడం వల్ల ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లుతారని పండితులు వివరించారు. కార్యక్రమంలో స్థానికులు కొమ్మె నాగప్ప, గోపాల్, గరుడప్ప, తిప్పారెడ్డి, కేశప్పతో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు.

పచ్చిమిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలి


చిరుమాన్‌దొడ్డి సమీపంలోని పొలాల్లో పచ్చి మిర్చిని చూపుతున్న రైతులు

ఆస్పరి: పచ్చిమిర్చికి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ ఆలూరు తాలూకా కార్యదర్శి మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామ సమీపంలోని పచ్చిమిర్చి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. మార్కెట్లో 20 కేజీల పచ్చిమిర్చి ప్యాకెట్ రూ.20 ధర పలుకుతుందన్నారు. బోర్ల కింద లక్షలు వెచ్చించి పంట సాగు చేశారని, ధర పడిపోవడంతో కూలీలకు కూడా రావడం లేదని వాపోతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కోరారు.

ఆధ్యాత్మిక ప్రాంతాన్ని అపవిత్రం కానివ్వొద్దు


ఆర్ఐ బసవన్న గౌడ్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఆలూరు/ఆలూరు రూరల్: స్థానిక బళ్లేగుండు ఆంజనేయ స్వామి ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేస్తున్న 54 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహ ప్రాంతాన్ని అపవిత్రం కానివ్వొద్దని ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ.. హైవే 167లో రూ.లక్షలు ఖర్చు చేసి 54 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఆ ప్రాంతం ఆధ్యాత్మికతతో అభివృద్ధి చెందుతోందన్నారు. అయితే ఇటీవల విగ్రహం ఎదురుగా హైవే పక్కన కొందరు మృతదేహాన్ని ఖననం చేశారన్నారు. గతంలో రెవెన్యూ అధికారులు వారికి ఈ స్థలాన్ని కేటాయించారని చెబుతున్నా అది ఎంత వరకు నిజమనేది తమకు తెలియదన్నారు. ఇదే విషయాన్ని 2022 నంబర్‌లో అక్కడ ఇతరులకు స్థలం కేటాయించారని దాన్ని రద్దు చేయాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశామని చెప్పారు. ఆధ్యాత్మిక ప్రాంతం అపవిత్రం కాకుండా చూడాలని ఆర్ఐ బసవన్న గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్ రెడ్డి, ఆర్ఐ బసన్న గౌడ్ మాట్లాడుతూ.. దీనిపై విచారించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని చెప్పారు.

నేడు బండలాగుడు పోటీలు

కృష్ణగిరి: మండలంలోని పెద్దొడ్డి గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి పండుగ సందర్భంగా శనివారం సేద్యపు ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శివ, రంగనాయకులు, గోకారి శుక్రవారం తెలిపారు. గెలుపొందిన వృషభాల యజమానులకు దాతల సహకారంతో వరుసగా రూ.10 వేలు, రూ. 7వేలు, రూ. 4 వేలు, రూ. 2 వేలు అందజేస్తామని చెప్పారు. వివరాలకు సెల్ 9573108946, 9963964592 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు..

శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని పెనుమాడ, పెద్దొడ్డి గ్రామాల్లో శనివారం ఆంజనేయస్వామి వారికి గ్రామోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయా గ్రామాల పెద్దలు శుక్రవారం తెలిపారు. పెనుమాడ సమీపంలోని కొండపైకి గుర్రంతో వెళ్లి అక్కడ ధనలయ్యకు పూజలు చేపడతామన్నారు. కోయిలకొండలో కృష్ణస్వామి ఉత్సవం ఉంటుందని చెప్పారు.

పంటల్లో చీడపీడలను నివారించుకోవాలి

దేవనకొండ: పత్తి పంటలో ఆకుమచ్చ తెగులు, గులాబీరంగు పురుగు ఉధృతి అధికంగా ఉందని, నివారించుకోవాలని ఏఓ సురేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని దేవనకొండ, కూకటికొండ తదితర గ్రామాల్లో రైతులు సాగుచేసిన పత్తి, వేరుశనగ పంటలను పరిశీలించారు. ఆకు మచ్చ తెగులు నివారణకు కాంటాఫ్ 1 ఎం.ఎల్ ఒక లీటర్ నీటికి మరియు 19;19;19 5 గ్రాముల ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పత్తిలో గులాబీ రగు పురుగు నివారణకు మొదటగా లింగాకర్షక బుట్టలను ఎకరాకు 5 నుంచి 6 వరకు ఏర్పాటు చేయాలన్నారు. వేపనూనె (1000పీపీఎం) 5 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని చెప్పారు. 60 రోజుల పంటకు ప్రోఫెనోఫాస్ 2 ఎం.ఎల్ లీటర్ నీటిలో కలుపుకుని స్ప్రే చేయాలన్నారు. పేనుబంక ఉన్న పొలాల్లో హర్ క్లాస్ అనే మందును ఒక గ్రాము ఒక లీటర్ చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలని వివరించారు.

మొక్కలను నాటి పరిరక్షించాలి


కోయిలకొండ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న దృశ్యం


మొక్క నాటుతున్న ఏపీఓ హేమసుందర్

కృష్ణగిరి: మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని సర్పంచ్ లక్ష్మి ఈశ్వరయ్య, హెచ్ఎం మైఖేల్ పిలుపునిచ్చారు. మండలంలోని కోయిలకొండ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఏపీఓ శేషిరెడ్డి, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హొలహర్వి: ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పెంచాలని ఏపీఓ హేమసుందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం వనం–మనం కార్యక్రమంలో భాగంగా స్థానిక కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఊరూరా మొక్కలు నాటిస్తున్నామన్నారు. టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేటీలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో బాపురం వంతెన

హొలహర్వి: మండలంలోని బాపురం–గూళ్యం వెళ్లే రహదారిలోని బాపురం కాలువపై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జిని 50 సంవత్సరాల క్రితం నిర్మించారు. వంతెనకు ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు పడిపోయాయి. ప్రస్తుతం కాలువలో భారీగా నీరు ప్రవహిస్తుంది. ఈ కాలువపై నుంచి మండలంలోని గూళ్యం గాదిలింగేశ్వరస్వామి ఆలయానికి ఆంధ్ర, కర్ణాటక భక్తులు పెద్ద సంఖ్యలో వాహనాల్లో తరలివస్తారు. అప్రమత్తంగా లేకపోతే ప్రమాదం చోటు చేసుకునే అవకాశముందని, అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.


రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా బాపురం బ్రిడ్జి

గుంతలు పూడ్చండి

ఆలూరు: నేషనల్ హైవే 167పై పడిన గుంతలను అధికారులు పూడ్చి ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నియోజకవర్గ కార్యదర్శి మునిస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆలూరు, పెద్దహోతూరు గ్రామ నడిరోడ్డుపై గుంతలను హైవే అథారిటీ అధికారులు తక్షణమే పూడ్చి వేయాలని నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ హైవేపై పడిన గుంతలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రం ముందు ఇలా..

హొలహర్వి: నిట్రవట్టి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-3కు వెళ్లే రహదారి బురదమయంగా మారింది. దీంతో చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బంది కేంద్రానికి వెళ్లలేకపోతున్నారు. చిన్నారులు తెలియక కేంద్రంలో వెళ్లే క్రమంలో బురదలో పడిపోతున్నారు. వారిని లేపడానికి, తీసుకురావడానికి వెళ్లిన వారు సైతం అందులో కాలుజారి పడిపోతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు నిలిచి మురుగు కుంటలా మారింది. దీంతో కొన్నిరోజులుగా పిల్లలు కేంద్రానికి వెళ్లలేకపోతున్నారు. అధికారులు స్పందించి మట్టి వేసి చదును చేయించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


నిట్రవట్టి అంగన్‌వాడీ కేంద్రం-3 ముందు బురదమయం